
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 3 । ఏప్రిల్ । 2023



గ్రామీణాభివృద్ధి భేష్

డీఆర్‌డీఏ అధికారులు గ్రామీణాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేస్తున్నారు. 8లో



టమాట కిలో రూ.12

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట ధర గరిష్ఠంగా రూ.12, కనిష్ఠంగా రూ.4, సరాసరిన రూ.7 పలికింది. మార్కెట్‌కు 65 టన్నుల టమాటాలు అమ్మకానికి వచ్చాయి.

గరిష్ఠం/కనిష్ఠం
40.8°/22.1°

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. భానుడి భగభగలు కొనసాగాయి. ఉక్కపోతతో జనం ఇబ్బందులు పడ్డారు.



రంజాన్ వేళలు

సోమవారం	మంగళవారం
ఇఫ్తార్	సెహరి
06.34	04.57

న్యూస్‌రీల్

నేటి నుంచి 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్ పింఛన్ కానుకను సోమవారం సాయంత్రం నుంచి వలంటీర్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 2,64,121 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.73,32,90,000 విడుదల చేసినట్లు వెల్లడించారు. సచివాలయ ఉద్యోగులు ఉదయం బ్యాంకులకు వెళ్లి నగదు డ్రా చేసి లబ్ధిదారులకు వలంటీర్ల ద్వారా అందజేయనున్నట్లు తెలిపారు. 5 రోజుల పాటు పింఛన్ పంపిణీ ఉంటుందన్నారు.

ఖాద్రీశుని సేవలో జీఎస్టీ డీసీ



మురళీకృష్ణకు శ్రీవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని ఉమ్మడి జిల్లా జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ (డీసీ) మురళీకృష్ణ కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను అర్చకులు వారికి వివరించారు. తీర్థప్రసాదాలు అందజేసి దుశ్శాలువ, పూలమాలలతో సన్మానించారు. స్వామివారి చిత్రపటాన్ని ఆలయ కమిటీ సభ్యులు బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అశ్వర్థ నారాయణ, గోపాల్‌రెడ్డి, ఆడిటర్ సయ్యద్ తబ్రేజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'



పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం 'స్పందన' నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి. బసంత్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంలో 'స్పందన' జరిగినంత సేపూ మండల కేంద్రాల్లోనూ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండల స్థాయి అధికారి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించాలన్నారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



కల్లూరు వద్ద పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

గార్లదిన్నె: బెంగళూరు నుంచి గుంతకల్లు వైపు వెళ్తున్న గూడ్స్ రైలు గార్లదిన్నె మండలం కల్లూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున పట్టాలు తప్పింది. ఆరవ సైడ్ ట్రాక్‌పై మూడు వ్యాగిన్లు పట్టాలు తప్పినట్లు సమాచారం అందగానే రైల్వే యాక్సిడెంట్ రిలీఫ్ వ్యాన్ సిబ్బంది హుటాహుటిన చేరుకున్నారు. పడిపోయిన బోగీలను ట్రాక్‌పై నుంచి తొలగించారు. ఈ ఘటనతో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు రెండు గంటలపాటు ఆలస్యంగా నడిచాయి. గూడ్స్ రైలు ప్రమాదంలో ఎవ్వరూ గాయపడలేదని అధికారులు తెలిపారు.

ఆల్ ది బెస్ట్!

పరీక్షల షెడ్యూల్	
పరీక్ష తేదీ	సబ్జెక్టు
ఏప్రిల్ 3	ఫస్ట్ లాంగ్వేజ్
ఏప్రిల్ 6	సెకండ్ లాంగ్వేజ్
ఏప్రిల్ 8	ఇంగ్లిష్
ఏప్రిల్ 10	మ్యాథమేటిక్స్
ఏప్రిల్ 13	సైన్స్ (ఫిజిక్స్, బయాలజీ)
ఏప్రిల్ 15	సోషల్ స్టడీస్
ఏప్రిల్ 17	కాంపోజిట్ కోర్సు
ఏప్రిల్ 18	ఒకేషనల్ కోర్సు

- నేటి నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు
- పరీక్షలు రాయనున్న 25,881 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- నో సెల్‌ఫోన్ జోన్‌లుగా పరీక్ష కేంద్రాలు



కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద అధికారులకు సూచనలిస్తున్న ఆర్‌జేడీ ప్రతాప్ రెడ్డి

జిల్లాలో ఏర్పాట్లు ఇలా..	
పరీక్ష కేంద్రాలు	125
ఇన్విజిలేటర్లు	1,150
చీఫ్ సూపరింటెండెంట్లు	125
డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు	125
ఫ్లయింగ్ స్క్వాడ్	6
సిట్టింగ్ స్క్వాడ్	36

ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 18 వరకు జరగనున్నాయి. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటికే పాఠశాల విద్యా శాఖ అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా సౌకర్యాలు కల్పించారు. పేపర్ లీకేజీలు, మాస్‌కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు అరగంట ముందే కేంద్రాల వద్దకు చేరుకోవాలని సూచిస్తున్నారు.

పరీక్షలు రాయనున్న 25,881 మంది విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేట్ యాజమాన్యాల కింద 424 హైస్కూళ్లు ఉన్నాయి. 125 కేంద్రాల్లో పరీక్షలు సాగుతాయి. రెగ్యులర్, ప్రయివేట్ కలిపి మొత్తం 25,881 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. 106 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు సైతం పరీక్షలు రాస్తున్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ల నియామకాలను పూర్తి చేశారు. ఈ ఏడాది లోటుపాట్లకు తావులేకుండా సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లుగా ప్రభుత్వం ఉపాధ్యాయులు, ఉద్యోగులనే నియమించింది. పేపర్ లీకేజీలు, మాల్ ప్రాక్టీస్ వంటి వాటికి తావు లేకుండా పరీక్ష కేంద్రాల వద్ద పకడ్బందీగా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే చీఫ్ సూపరింటెండెంట్‌లకు కూడా సెల్ ఫోన్‌లను అనుమతించడం లేదు. పరీక్ష కేంద్రాల బయటే సెల్‌ఫోన్ ఉంచాలని నిబంధన అమలు చేస్తున్నారు. క్యాలిక్యులేటర్లు, ఇయర్‌ఫోన్లు, బ్లూటూత్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్ష కేంద్రాలకు సమీపంలోని ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లను సైతం పరీక్ష సమయంలో మూత వేయిస్తారు.

ప్రత్యేక కోడ్‌తో లీకేజీకి చెక్..

ప్రతి పరీక్ష కేంద్రానికి ఏడంకెల ప్రత్యేక కోడ్ కేటాయించి ముద్రించారు. ఒక వేళ ప్రశ్నాపత్రం లీక్ అయితే అది ఏ సెంటర్‌లో లీకైందో తెలుసుకుని ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టేందుకు వీలుగా ఈ ఏర్పాటు చేశారు. ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్ ద్వారా సైతం ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే పరీక్ష కేంద్రం వివరాలు తెలుసుకునే వీలుందని అధికారులు చెబుతున్నారు. పరీక్షలను పటిష్ఠంగా నిర్వహించే క్రమంలో ఈ ఏడాది మరో కొత్త నిబంధన అమలులోకి తీసుకొచ్చారు. విద్యార్థులకు ఓఎంఆర్ షీట్‌తో పాటు 24 పేజీల బుక్‌లెట్ ఇస్తారు. ఇంకా అవసరం అనుకుంటే మరో 12 పేజీల బుక్‌లెట్ తీసుకునే వీలుంది. వీటిలో ఒక్క పేజీని చింపినా మాల్‌ప్రాక్టీస్ జరిగినట్లుగానే నిర్ధారించి సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారు.

హాల్‌టికెట్ చూపితే ప్రయాణం ఉచితం

పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు ఉచితంగా తీసుకువెళ్లేలా ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులు హాల్ టికెట్ చూపించి బస్సుల్లో ప్రయాణించవచ్చు. యాజమాన్యాల అభ్యర్థన మేరకు జిల్లాలో పలు చోట్ల పరీక్ష కేంద్రాలకు ప్రత్యేక బస్సులను సైతం నడుపుతున్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

కొత్తచెరువు: మండల కేంద్రంలోని బాలుర, బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆదివారం ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షితో కలసి ఆర్‌జేడీ ప్రతాప్ రెడ్డి పరిశీలించారు. సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలు ప్రశాంతంగా రాసేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సిబ్బందికి సైతం సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతి లేదన్నారు. బాలికలకు అసౌకర్యం కలగకుండా ప్రతి పరీక్ష కేంద్రంలో తనిఖీ చేసేందుకు ఇద్దరు మహిళా ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తినా ఫిర్యాదు చేయడానికి కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాలలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం పరీక్షల నిర్వహణపై కొత్తచెరువులోని డీఈఓ కార్యాలయంలో ఆయన సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పరీక్షలు తొలిసారి జరుగుతున్నాయని, సమన్వయంతో వ్యవహరిస్తూ విజయవంతం చేయాలని కోరారు. విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేయకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసే వాతావరణం కల్పించాలన్నారు. బాలికల పట్ల అనుచితంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. పొరపాట్లు జరిగితే అధికారులనే బాధ్యులను చేస్తామని హెచ్చరించారు.

తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు

- ఎంజేపీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఎంజేపీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్

చిలమత్తూరు: పిల్లలను ఎంతో నమ్మకంతో పాఠశాలకు పంపే తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయొద్దని ఎంజేపీ (మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే) గురుకుల పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్ తెలిపారు. ఆదివారం ఆయన మండలంలోని టేకులోడు క్రాస్‌లోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల జిల్లా కన్వీనర్ ప్రసాద్‌తో పాటు స్థానిక సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలోని 16 పాఠశాలల్లో లేని సమస్యలు ఇక్కడే ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. విద్యార్థినుల పట్ల ఎందుకు దురుసుగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కోల్పోయేలా ప్రవర్తించడం మంచిది కాదన్నారు. ఇటీవల కాలంలో పోక్సో కేసు నమోదు మొదలు, 8వ తరగతి విద్యార్థిని మహిత మృతి వంటి వరుస సంఘటనలతో సిబ్బంది నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందన్నారు. పాఠశాలలో 56 మంది సిబ్బంది ఉన్నారని, రాష్ట్రంలోనే ఇంతమంది ఎక్కడా లేరన్నారు. ఈ పాఠశాల నుంచి ఎంబీబీఎస్, ఇంజినీరింగ్ వంటి విభాగాల్లో కోర్సులు పూర్తి చేసి విద్యార్థినులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని, అలాంటి పాఠశాల పేరు చెడగొట్టవద్దని హెచ్చరించారు. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకూడదనే ఇద్దరిపై వేటు వేశామన్నారు. జరిగిన ఘటనల్లో సిబ్బంది నిర్లక్ష్యం ఉందని గుర్తించామని, నివేదికను ప్రభుత్వానికి అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ చైర్మన్ సోమశేఖర్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులకు స్వర్గధామం

పరిశ్రమల ఖిల్లాగా పేరొందిన శ్రీ సత్యసాయి జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి మరింతగా పరుగులు పెట్టనుంది. కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏపీఐఐసీ భూములను సిద్ధం చేసింది. ఉద్యోగ కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన పారిశ్రామిక విధానంతో పెట్టుబడులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

- పరిశ్రమల స్థాపనకు ఢోకా లేకుండా భూముల సేకరణ
- ఏపీఐఐసీ చేతిలో 19 వేల ఎకరాల భూమి
- గడిచిన నాలుగేళ్లలో భారీగా ఎంఎస్ఎంఈల ఏర్పాటు
- కొత్త పాలసీతో మరింత ఊపు తెచ్చిన ప్రభుత్వం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: సర్కారు చర్యలతో జిల్లా పెట్టుబడులకు స్వర్గధామంగా మారుతోంది. ఇప్పటికే పారిశ్రామికాభివృద్ధిలో రాష్ట్రంలోనే ముందంజలో ఉన్న జిల్లా భూముల నిల్వ (ల్యాండ్ బ్యాంక్) విషయంలోనూ ముందువరుసలో నిలిచింది. ఏపీఐఐసీ (ఏపీ మౌలిక సదుపాయాల సంస్థ) చేతిలో 19 వేల ఎకరాలకు పైగా నిల్వ ఉన్నట్టు తేలింది. దీంతో కొత్తగా వచ్చే పరిశ్రమలకు భూములను కేటాయించడంలో ఇబ్బందులుండవు. ఇటీవల విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో భాగంగా ఇండస్ట్రియల్ పాలసీని తీసుకొచ్చారు. కొత్తగా పెట్టుబడులు పెట్టే వారికి పాలసీ సానుకూలంగా ఉందని నిపుణులు చెబుతున్నారు.

కొత్త పాలసీ ఇలా..

- వైఎస్సార్ ఏపీ వన్ పేరుతో కొత్త యాప్‌ను, పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.
- పరిశ్రమల స్థాపనకు అనుమతులు తీసుకోవాలంటే 33 శాఖల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడలా ఉండదు. వైఎస్సార్ వన్‌యాప్ ద్వారా పరిశ్రమకు దరఖాస్తు చేసిన 21 రోజుల్లోగా అనుమతులు పొందవచ్చు.
- ఇండస్ట్రియల్ పార్కులను అభివృద్ధి చేసేందుకు ప్రోత్సాహకాలు.
- పరిశ్రమలకు సంబంధించి అవసరమైన భూమిని వెంటనే అందించేందుకు చర్యలు
- సరుకు రవాణా, గిడ్డంగులు వంటి వాటికి పరిశ్రమల హోదా కల్పిస్తారు. దీనివల్ల రాయితీలు వస్తాయి
- స్టార్టప్ కంపెనీలకు ప్రాధాన్యత ఇవ్వడం ఈ పాలసీ ముఖ్య ఉద్దేశం.

ఎస్సీ, ఎస్టీలకు భారీగా రాయితీ

కొత్తగా వచ్చిన ఇండస్ట్రియల్ పాలసీ ప్రకారం ఎస్సీ ఎస్టీలకు భారీగా రాయితీ కల్పిస్తున్నారు. ఎస్సీ ఎస్టీ వర్గానికి సంబంధించిన వారు పరిశ్రమల ఏర్పాటుకు వస్తే వారికి 45 శాతం లేదా రూ.1.20 కోట్ల వరకూ రాయితీ అందిస్తారు. దీంతో ఎక్కువ మంది ఎస్సీ ఎస్టీలు ముందుకు వచ్చే అవకాశం ఉంది. సేవలు, రవాణా రంగంలో పెట్టుబడులకు రూ.75 లక్షల వరకూ రాయితీ ఇస్తారు. మహిళలకు ప్రోత్సాహకంగా 15 శాతం లేదా రూ.30 లక్షల వరకూ రాయితీ ఇవ్వనున్నారు. ఓసీ, బీసీలకు రూ.20 లక్షల వరకూ రాయితీ ఇవ్వనున్నారు. భూములకు 50 శాతం లేదా రూ.20 లక్షల వరకూ రాయితీ అందుతుంది.

జిల్లాలో ఏపీఐఐసీ వద్ద ఉన్న భూమి ఇలా..	
కేటగిరీ	భూములు (ఎకరాల్లో)
పట్టాభూమి	2,211.26
అసైన్డ్ భూమి	6,380.83
ప్రభుత్వ భూమి	10,426.17
మొత్తం	19,018.26
2019 తర్వాత జిల్లాలో పరిశ్రమలు ఇలా..	
లార్జ్ అండ్ మెగా ఇండస్ట్రీ	22
పెట్టుబడులు (రూ.కోట్లలో)	14,790
ఉద్యోగాలు	12,785
ఎంఎస్ఎంఈలు	1,532
పెట్టుబడులు (రూ. కోట్లలో)	674
ఉద్యోగాలు	11,312

సకాలంలో అనుమతులు

కొత్తగా తీసుకొచ్చిన ఇండస్ట్రియల్ పాలసీతో ఎక్కువ మంది చిన్న, మధ్యతరగతి వారు పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం తరఫున రాయితీలు ఇచ్చి, సకాలంలో అనుమతులు ఇచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో గడిచిన నాలుగేళ్లలో ఎంఎస్ఎంఈల ఏర్పాటులో మంచి పురోభివృద్ధి సాధించాం.

– మెట్టు గోవిందరెడ్డి, చైర్మన్, ఏపీఐఐసీ

సానుకూల పరిస్థితులు

జిల్లాలో పరిశ్రమలు స్థాపించాలనుకునే వారికి సానుకూల పరిస్థితులు ఉన్నాయి. కొత్త ఇండస్ట్రియల్ పాలసీతో ప్రభుత్వం ఊపు తీసుకొచ్చింది. భూములు కావాల్సినన్ని ఉన్నాయి. ఇప్పటికే కొత్త పరిశ్రమలు స్థాపించడానికి ముందుకు వస్తున్నారు.

– చాంద్‌బాషా, మేనేజర్, పరిశ్రమల శాఖ

టపాసులు పేలి ఐదుగురికి తీవ్రగాయాలు



నిదర్శన్



వాణిశ్రీ



నరసింహులు



ఆదినారాయణ

- తమ్ముళ్ల' అత్యుత్సాహంతో ఘటన

బత్తలపల్లి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రలో ఆ పార్టీ కార్యకర్తల అత్యుత్సాహం వల్ల టపాసులు పేలి ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం బత్తలపల్లి మండలం పోట్లమర్రి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలోకి లోకేష్ పాదయాత్ర ప్రవేశించగానే.. ముందుగా వస్తున్న వాహనంలో నుంచి టపాసులు కిందకు వేసుకుంటూ వచ్చారు. అనంతరం వాటిని కాల్చారు. ఈ క్రమంలోనే ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఓ టపాసు కాల్చగా అది పైకి వెళ్లి పేలకుండా కిందనే పేలిపోయింది. అదీ జనం మధ్యలో పేలడంతో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో చిన్నపరెడ్డిపల్లికి చెందిన రత్నమ్మ (పుట్టింటికి పండుగకు వచ్చింది), ఐదేళ్ల వయసున్న నిదర్శన్(పోట్లమర్రి), తోపుదుర్తికి చెందిన వాణిశ్రీ (పండుగకు బంధువుల ఇంటికి వచ్చింది), చెన్నేకొత్తపల్లికి చెందిన నరసింహులు(బతుకు దెరువు నిమిత్తం మూడేళ్లుగా పోట్లమర్రిలో ఉంటున్నాడు), సంగాల గ్రామానికి చెందిన ఆదినారాయణ (పాదయాత్ర చూసేందుకు వచ్చాడు) ఉన్నారు. వీరిని 108 వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అయితే వారిని టీడీపీ నాయకులు కనీసం పరామర్శించలేదు.

మందు తాగండి.. వెంట నడవండి



బత్తలపల్లిలోని ఓ దుకాణం వద్ద మద్యం కొనుగోలు చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

బత్తలపల్లి: యువగళం పాదయాత్రకు వచ్చిన తెలుగు తమ్ముళ్లు మద్యంమత్తులో జోగారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో మండలకేంద్రంలో మద్యం దుకాణాలు ఆదివారం కళకళలాడాయి. బత్తలపల్లిలో రెండు మద్యం దుకాణాలు ఉండగా ఒక్కరోజే దాదాపు రూ.11లక్షల వరకు వ్యాపారం జరిగింది. మొదటి దుకాణంలో మామూలుగా ఆదివారం రోజుల్లో రూ.2.50 లక్షలయ్యేది. లోకేష్ రాకతో అది రూ.6 లక్షలకు చేరుకుంది. రెండో దుకాణంలో మామూలు రోజుల్లో రూ.3 లక్షలు వ్యాపారం జరుగుతుండగా, తమ్ముళ్ల మద్యం దాహానికి రూ.5 లక్షలకు చేరుకుంది.

నేటి నుంచి ఒంటిపూట బడులు

- ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు

రాప్తాడురూరల్: పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ఒంటిపూట బడుల నిర్వహణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం నుంచి అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఒంటిపూట బడులు నిర్వహించాలని ఆదేశించింది. జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, అన్ఎయిడెడ్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విధిగా ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మాత్రమే పాఠశాలలు నడపాలని ఇన్‌చార్జ్ జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి ఆదేశించారు. పదో తరగతి పరీక్ష కేంద్రాలున్న పాఠశాలల్లో పరీక్షలు జరిగే ఆరు రోజులు తక్కిన తరగతులకు సెలవులు ప్రకటించారు. అయితే ఈ నెల 30లోగా ఈ ఆరు రోజులను సెలవుదినాల్లో ఆయా తరగతుల విద్యార్థుల కోసం పాఠశాలలు పెట్టుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించి తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెనూ పాటించకుంటే ఫిర్యాదు చేయండి

కదిరి అర్బన్: హాస్టళ్లలో మెనూ పాటించకుంటే తనకు ఫిర్యాదు చేయాలని స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. మున్సిపల్ పరిధిలోని డిగ్రీ కళాశాల వద్ద ఉన్న ఎస్సీ, ఎస్టీ బాలుర కళాశాల హాస్టళ్లను ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని ఆరా తీశారు. విద్యార్థులు లేదని చెప్పడంతో వసతిగృహం వార్డెన్ సాంబశివుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ పాటించకపోతే చర్యలు తప్పవని ఎస్సీ వసతి గృహం వార్డెన్ ఖుర్షిద్‌ను హెచ్చరించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ మెనూ ప్రకారమే భోజనం అందించాలని వార్డెన్లను నిలదీయాలని సూచించారు. గోడపై మెనూ వివరాలు ప్రదర్శించాలన్నారు. ప్రభుత్వం నెలకు ఒక్కో విద్యార్థికి రూ. 1,400 ఇస్తోందని, జూన్ నుంచి 1,600 అందుతుందని చెప్పారు. వారానికి రెండు రోజులు చికెన్, రోజూ కోడిగుడ్డు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. విద్యార్థులు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, ఇక నుంచి మెనూ ప్రకారం భోజనం అందించకపోతే తనకు ఫిర్యాదు చేయాలని సెల్ నంబరు అందజేశారు. వాట్సాప్‌లో తనకు వీడియో పంపితే సంబంధింత వార్డెన్‌ను ఇంటికి పంపిస్తానని హామీ ఇచ్చారు. ఫిర్యాదు రావడంతోనే తనిఖీ చేసేందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి

క్లుప్తంగా

దుస్తుల దుకాణంలో అగ్ని ప్రమాదం


ఆర్థిక సాయం అందజేస్తున్న వెంకటేష్

ధర్మవరం: స్థానిక ప్రియాంక నగర్‌లోని ఓ రెడీమేడ్ దుస్తుల దుకాణంలో ఆదివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో రూ.1 లక్ష మేర నష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. దుకాణ యజమాని ప్రశాంత్‌ను స్థానిక కౌన్సిలర్ మేడాపురం వెంకటేష్ పరామర్శించి, ప్రమాద ఘటనపై ఆరా తీశారు. తక్షణ సాయం కింద రూ.20 వేలు అందజేశారు. అధైర్య పడకూడదని, అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

ఇటుకల బట్టీ కార్మికుడి దుర్మరణం


మృతుడు వెంకటనారాయణ

ధర్మవరం అర్బన్: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పై నుంచి కిందకు పడి ఇటుకల బట్టీ కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని శివరాంనగర్‌కు చెందిన గుజ్జల వెంకటనారాయణ (56)కు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటుకల బట్టీలో కార్మికుడిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం బట్టీలోని ఇటుకలను ట్రాక్టర్‌కు లోడ్ చేయించుకుని వెళుతుండగా కుదుపులకు అదుపు తప్పి కిందపడి, అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

గ్రామస్తులకు పట్టుబడ్డ గొర్రెల దొంగ

తాడిమర్రి: గొర్రెలను అపహరించుకెళ్లేందుకు వచ్చిన ఓ యువకుడిని స్థానికులు పట్టుకుని చెట్టుకు కట్టేశారు. వివరాలు... తాడిమర్రి మండలం మరువపల్లిలో ఆదివారం వేకువజాము 2 గంటలకు గొర్రెలను అపహరించుకెళ్లేందుకు ఓ ముఠా సభ్యులు వచ్చారు. ఆ సమయంలో గొర్రెల అరుపులతో అప్రమత్తమైన కాపరులు వన్నూరప్ప, లక్ష్మీనారాయణ.. వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించి, ఓ యువకుడిని పట్టుకున్నారు. మిగిలిన ముగ్గురు పారిపోయారు. పట్టుబడిన దొంగను చెట్టుకు కట్టేసి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ, సిబ్బంది అక్కడకు చేరుకుని దొంగను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. నిందితుడిని నార్శింపల్లికి చెందిన వాడిగా గుర్తించారు. మిగిలిన ముగ్గురి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. దొంగలు వచ్చిన ఆటోను స్వాధీనం చేసుకుని, ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గ్రామీణాభివృద్ధి భేష్

- సంక్షేమాన్ని ప్రజలకు చేర్చడంలో 'డీఆర్‌డీఏ' సఫలం



సాక్షి, పుట్టపర్తి: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సమర్థంగా లబ్ధిదారుల దరికి చేర్చడంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) అధికారులు సఫలమయ్యారు. కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత పుట్టపర్తిలో అందుబాటులో ఉండడంతో పాటు ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పలు ప్రాంతాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నారు. పథకాలను అర్హులకు సకాలంలో అందజేయడంతో పాటు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఏడాది కాలంగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేయడంలో డీఆర్‌డీఏ అధికారులు సఫలీకృతులయ్యారు. ఎక్కడా జాప్యం లేకుండా, అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేర్చారు. కొత్త జిల్లా ఏర్పాటుతో పరిధి తక్కువగా ఉండటంతో ఏ మారుమూల గ్రామానికైనా ఉన్నతాధికారులు వెళ్లేందుకు వీలు ఏర్పడింది. ఫలితంగా ప్రభుత్వ పథకాలు అర్హులకు సకాలంలో అందుతున్నాయి.

ఠంచన్‌గా పింఛన్

జిల్లా వ్యాప్తంగా 2,65,187 పింఛన్‌దారులు ఉన్నారు. వీరందరికీ ప్రతి నెలా రూ.73.626 కోట్లను ప్రతి నెలా 1వ తేదీ నుంచి 2వ తేదీలోపు అందజేస్తున్నారు. వైఎస్సార్ చేయూత పథకానికి జిల్లాలో 13,614 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం కేటాయించిన రూ.208.48 కోట్లను సకాలంలో మంజూరు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా కల్యాణమస్తు /షాదీ తోఫాకు 491 దరఖాస్తులు అందగా, అన్నింటికీ అనుమతులు ఇచ్చారు. 6,200 స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న 31,334 మందికి స్త్రీ నిధి పథకం కింద రూ.156.67 కోట్లు ప్రభుత్వం అందజేసింది.

'బీమా'తో ధీమా

వైఎస్సార్ బీమా కోసం 781 రిజిస్ట్రేషన్లు వచ్చాయి. ఇందులో 386 మందికి బీమా సొమ్ము అందజేశారు. సాధారణ మరణాలకు సంబంధించి 343 మంది వివరాలు నమోదు కాగా, పరిహారం పంపిణీ ప్రక్రియ వంద శాతం పూర్తయింది. మొత్తం రూ.3.43 కోట్లను బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. జగనన్న తోడు పథకానికి 10,146 మంది అర్హులుండగా వీరి కోసం రూ.1.014 కోట్లు కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా 23,340 స్వయం సహాయక సంఘాల్లోని మొత్తం 2,30,846 మంది సభ్యులకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.180 కోట్లు అందజేశారు. అలాగే ఉన్నతి పథకం కింద 1,012 స్వయం సహాయక సంఘాలు లబ్ధి పొందాయి. ఆయా గ్రూపుల్లో మొత్తం 3,278 మంది సభ్యులకు రూ.16.39 కోట్ల లబ్ధి చేకూరింది.

సకాలంలో అందజేస్తున్నాం



సంక్షేమ పథకాల సొమ్మును సకాలంలో లబ్ధిదారులకు అందజేస్తున్నాం. వంద శాతం లక్ష్యం పూర్తి చేశాం. ఎక్కడా జాప్యమనేది లేకుండా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, హర్ ఘర్ తిరంగ్, చేయూత మహిళా మార్ట్, జాతీయ లింగ వివక్షత, అనీమియా, పోషన్ అభియాన్, పోషన్ పక్వాడా తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పించాం.

– నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

పప్పు, పరిటాల కుటుంబంతోనే 'జాకీ' దూరం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: పప్పు లోకేష్, పరిటాల కుటుంబం చర్యల ఫలితంగానే జాకీ పరిశ్రమ జిల్లాకు దూరమైందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఆసరా వారోత్సవాలకు ఎమ్మెల్సీ మంగమ్మతో కలసి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. 2016లో రాప్తాడు సమీపంలో జాకీ పరిశ్రమ ఏర్పాటు కోసం రూ.140 కోట్ల విలువ చేసే 28 ఎకరాల భూమిని చంద్రబాబు, లోకేష్ బినామీ సంస్థ ఫేజ్ ఇండస్ట్రీకి రూ.3 కోట్లకే అప్పటి పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న నారా లోకేష్, జిల్లా మంత్రిగా ఉన్న పరిటాల సునీత కట్టబెట్టారని గుర్తు చేశారు. 2018 నాటికి ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పి, ప్రజలను నమ్మించి ఈ పనీ పూర్తి చేయలేకపోయారన్నారు. వారి చేతగాని తనానికి, వేధింపులకు పరిశ్రమను ఇక్కడ ఏర్పాటు చేయకుండా యాజమాన్యం వెనక్కు మళ్లిందన్నారు. ఈ విషయాలన్నీ అప్పట్లోనే పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయని గుర్తు చేశారు. ఇప్పటికీ వారు ఆధీనంలో ఉంచుకున్న ఆ భూమిని తనకు అప్పగిస్తే ఉచితంగా పరిశ్రమ నిర్మించి ఆరువేల మంది మహిళలకు ఉపాధి కల్పిస్తానని చెప్పారు. అలాగే దేవరకొండ, తోపుదుర్తి రిజర్వాయర్లను పూర్తి చేసి రైతులకు కానుకగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డి, ఎంపీపీ అంజలి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు డోలా రామచంద్రారెడ్డి, వేల సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే బీసీల అభ్యున్నతి

- బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్


రమేష్‌గౌడ్‌కు స్వాగతం పలుకుతున్న బీసీ, ప్రజా సంఘాల నాయకులు

కదిరి అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమౌతుందని ఆ పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం కదిరికి విచ్చేసిన ఆయనకు ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు, అనుబంధ సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీసీ, ప్రజాసంఘాల నాయకుల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో మాట్లాడారు. గత 12 ఏళ్లుగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి శ్రమిస్తున్న తనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బీసీల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ చేపట్టిన చర్యలను కొనియాడారు. అలాంటి ముఖ్యమంత్రిని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం బీసీలపై ఉందన్నారు. కార్యక్రమంలో కుమ్మరవాండ్లపల్లి మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ, లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగాల లోకేశ్వరరెడ్డి, పట్టణాధ్యక్షుడు బాహవుద్దీన్, బీసీ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సంపంగి గోవర్ధన్, హిందూపురం పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు నరసింహగౌడ్, గౌడసంఘం అధ్యక్షుడు రామ్మోహన్‌గౌడ్, బత్తల యువసేన నాయకులు ముబారక్, పవన్‌కుమార్‌రెడ్డి, వాల్మీకి అంజితో పాటు పలువురు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ – వృద్ధుడి మృతి


రామకృష్ణ మృతదేహం

నల్లమాడ: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. మరొకరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... నల్లమాడ సమీపంలోని బేల్దారి క్వార్టర్స్‌లో నివాసముంటున్న ఎం.రామకృష్ణ (60) ఆదివారం ఉదయం 8 గంటలకు మార్కెట్‌లో కాయగూరల కొనుగోలు చేసి, తన ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలు దేరాడు. అదే సమయంలో కమ్మవారిపల్లికి చెందిన యువకుడు ఎ.నాగార్జుననాయుడు పల్సర్ వాహనంపై వేగంగా దూసుకువస్తూ స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాల వద్ద బలంగా ఢీకొన్నాడు. ఘటనలో రోడ్డుపై పడిన రామకృష్ణ తలకు తీవ్ర గాయమైంది. ప్రమాదానికి కారణమైన నాగార్జున నాయుడు స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక రామకృష్ణ మృతి చెందాడు. కదిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నాగార్జున నాయుడు చికిత్స పొందుతున్నాడు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వలీబాషా తెలిపారు.

ఏపీఎల్ చైర్మన్‌గా మాంఛో



అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) చైర్మన్‌గా ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖపట్నం వేదికగా ఆదివారం జరిగిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఆయనను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శరత్‌చంద్రారెడ్డి, గోపీనాథరెడ్డి, ఉపాధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, సీఈఓ ఎంవీ శివారెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, మధు అభినందనలు తెలిపారు.

వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు


నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయిస్తున్న లోసారి నాగరాజు

కొత్తచెరువు: జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని కొత్తచెరువులోని బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యాయామ ఉపాధ్యాయ సంఘం సర్వసభ్య సమావేశానికి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మొరార్జీయాదవ్ అధ్యక్షత వహించారు. ఎన్నికల అధికారిగా ఏపీ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యక్షుడు లోసారి నాగరాజు, పరిశీలకులుగా ఉమ్మడి జిల్లా సంఘం కార్యదర్శి కుమార్‌రాజ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా చోళసముద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ శివకుమార్ ఎంపికయ్యారు. కార్యదర్శిగా తలమర్ల పాఠశాల పీడీ వెంకటేష్, గౌరవాధ్యక్షుడిగా రామకృష్ణ, గౌరవ చైర్మన్‌గా ఓబులేసు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రవీంద్రనాయక్, ఉపాధ్యక్షుడిగా రాజేష్, రమేష్, వెంకటరమణనాయక్, జాయింట్ సెక్రెటరీగా నరసింహమూర్తి, సూర్యనారాయణ, శివకుమార్, కోశాధికారిగా రామకృష్ణను ఎంపిక చేశారు. అనంతరం డీఈఓ కార్యాలయంలో ఆర్జేడీ ప్రతాపరెడ్డి, ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షిని నూతన కార్యవర్గ సభ్యులు కలసి మాట్లాడారు.

బోరు బండి దగ్ధం – ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


మృతుడు పెన్నప్ప


దగ్ధమవుతున్న బోరు బండి

ఆత్మకూరు: బోరు బండి దగ్ధమైన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం యర్రగుడి గ్రామానికి చెందిన బోయ పెన్నప్ప (48)కు భార్య రాజమ్మ, ఓ కుమారుడు ఉన్నారు. అనంతపురంలోని ఓ బోరు రిగ్గు యజమాని వద్ద డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఆత్మకూరు మండలం పి.కొత్తపల్లిలో ఓ రైతు పొలంలో బోరు వేసేందుకు సహాయకుడు, అనంతపురం నివాసి హాజీవలితో కలసి పెన్నప్ప వచ్చాడు. పని ముగించుకున్న అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. మార్గ మధ్యంలో పొలానికి అడ్డంగా లాగిన విద్యుత్ లైన్ రిగ్గును తాకాయి. ఘటనతో విద్యుత్ ప్రసారం జరిగి వాహనం నడుపుతున్న పెన్నప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. లారీలో వెనుక కూర్చొన్న హాజీవలిని మంటలు చుట్టుముట్టాయి. ఘటనతో లారీ నుంచి హాజీవలి కిందకు దూకేశాడు. అప్పటికే తీవ్రంగా గాయపడ్డాడు. దాదాపు గంటలకు పైగా ఎగిసి పడుతున్న మంటలను చూసి స్థానికులు ఎవరూ అటుగా వెళ్లలేకపోయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. ఘటనపై ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ఎంపీ గోరంట్ల మాధవ్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడుతున్న సంఘం నాయకులు

అనంతపురం: సమస్యలు పరిష్కరించాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ కాంట్రాక్టు ఉద్యోగులు కోరారు. ఈ మేరకు ఆదివారం అనంతపురం నగరంలో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులకు నెలకు రూ.20 వేలు ఇస్తామని వర్సిటీ ఉన్నతాధికారులు ప్రకటించారన్నారు. అయితే పాలకమండలి ఆమోదం పొందలేదని, జీతం రూ.16 వేలకు కుదించినట్లు పేర్కొన్నారు. గత 22 ఏళ్లుగా వర్సిటీలో చాలీచాలని వేతనంతో పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మల్లిరెడ్డి, జనరల్ సెక్రటరీ మంజునాథ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన 'వేమన' ఉత్సవాలు


వేమన ఆలయంలో బారులు తీరిన భక్తులు

గాండ్లపెంట: మండలంలోని కటారుపల్లిలో విశ్వకవి యోగి వేమన ఉత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు మహాశక్తి పూజను నిర్వహించారు. ఆలయం ఎదుట ధాన్యపు రాశిని పోసి పసుపు, కుంకుమ కలిపి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అందజేశారు. ఉత్సవాలకు ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాక, వైఎస్సార్, నెల్లూరు, కర్నూలు జిల్లాలతో పాటు కర్ణాటక ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం రాత్రి చాందినీ బండ్లమెరవణి ఉంటుంది.

విద్యార్థులపై సస్పెన్షన్ ఎత్తేయాలి

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై సస్పెన్షన్ ఎత్తేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యచంద్ర యాదవ్ కోరారు. ఆదివారం ఎస్కేయూలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2018 మార్గదర్శకాలకనుగుణంగా డిగ్రీ, పీజీ పరీక్షల మూల్యాంకనం చేయలేదన్నారు. దీంతో పదుల సంఖ్యలో విద్యార్థులను ఫెయిల్ చేశారన్నారు. ఈ అన్యాయాన్ని ప్రశ్నించినందుకు ఐదుగురు విద్యార్థులను సస్పెండ్ చేయడం తగదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్, జిల్లా కమిటీ సభ్యుడు రుషి, సందీప్, అనిల్ కుమార్, సన్నీ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామితోపాటు 108 సాలాగ్రామ శివ లింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకార్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

కుందుర్పి: సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఎఫ్ ఎకాలజీ ఏటీఎల్ ఎర్రస్వామిరెడ్డి, సేంద్రియ వ్యవసాయ కమ్యూనిటీ కోఆర్డినేటర్ ఓబుళపతి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అప్పిలేపల్లి పంచాయతీలో ఏఎఫ్ ఎకాలజీ పర్యవేక్షణలో మెట్టభూముల్లో సాగుచేసిన పండ్లతోటలను వారు పరిశీలించారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, పురుగు మందుల నివారణ తదితర అంశాలపై రైతులకు అవగాహన నిర్వహించారు. అప్పిలేపల్లి పంచాయతీలో 160 ఎకరాల్లో సేట్రీస్ అనే సంస్థ నిధులతో ఆర్డీటీ పర్యవేక్షణలో బహుళజాతి పండ్లమొక్కలు సాగుచేసి రైతులకు 90 శాతం సబ్సిడీతో మొక్కల పెంపకానికి అన్ని రకాల తోడ్పాటును అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే తమ సంస్థ ఆధ్వర్యంలో కుందుర్పి, మలయనూరు, నిజవల్లి, మహంతపురం పంచాయతీల్లో సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయశాఖ, ఆర్డీటీ పర్యవేక్షణలో వివిధ రకాల పంటల సాగుకు సహాయ సహకారాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అతావుల్లా, రైతులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత దుర్మరణం


మృతుడు శ్రీనాథ్

పుట్టపర్తి: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో వైఎస్సార్‌సీపీ నేత దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కపట్నం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, యాదవ సామాజిక వర్గ నాయకుడు పల్లపు శ్రీనాథ్ (32).. ఆదివారం ఉదయం పుట్టపర్తిలోని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరయ్యాడు. అనంతరం స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గూనిపల్లి సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా ముదిగుబ్బ నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీనాథ్‌ను కదిరి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై ఎస్‌ఐ నరసింహుడు దర్యాప్తు చేపట్టారు. కాగా, శ్రీనాథ్ మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు.

పెద్ద శేషవాహనంపై కోన రంగనాథుడు

తాడిపత్రి: మండలంలోని ఆలూరు కోన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి వారు పెద్ద శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. చైత్ర శుద్ధ ద్వాదశిని పురస్కరించుకొని ఆలూరు కోన రంగనాథస్వామిని ప్రత్యేక అలంకరణలో ఆలయ అర్చకులు ముస్తాబు చేశారు., అనంతరం స్వామి వారిని పెద్ద శేష వాహనంపై ఆలూరు గ్రామంలో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.


వాహనంపై ఊరేగుతున్న రంగనాథస్వామి

క్రికెట్ స్కాలర్‌షిప్ ఎంపికలకు స్పందన


క్రికెట్ ఎంపికలకు హాజరైన క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్థానిక అనంత క్రీడా గ్రామంలోని ప్రధాన క్రీడా మైదానంలో ఆదివారం హిందూస్థాన్ యూనీలివర్ స్కాలర్‌షిప్ ఎంపికలకు పోటీలు నిర్వహించారు. ఈ ఎంపికలకు ఉమ్మడి జిల్లాల నుంచి 60 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. వారిలో ప్రతిభ కనబరచిన వారిని హైదరాబాద్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల క్రీడాకారులతో జరిగే క్రికెట్ టోర్నీలో రాణించిన క్రీడాకారిణులను స్కాలర్‌షిప్‌కు ఎంపిక చేయనున్నారు.